క్లుప్తంగా

వైభవంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆలయం వద్దకు చేరుకుని ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణమనంతరం భక్తులకు ఆలయ భక్త బృందం సభ్యులు అన్నదానం చేయడంతో పాటు, సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. వార్డుమెంబర్ విష్ణుదాసు, భక్తబృందం సభ్యులు మఠం మునిస్వామి, కేశన్న, రామక్రిష్ణ, భీముడు, ఎర్రన్న, రాముడు, పాండు, తిక్కన్న, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించాలి



కొండాపురంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రమణారెడ్డి

సి.బెళగల్: రైతాంగం వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, కర్నూలు డీఎల్‌డీఓ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో సచివాలయ ప్రత్యేకాధికారి, ఏఓ మల్లేష్‌కుమార్ గ్రామ రైతులకు జీఎస్టీ స్లాబ్‌ల మార్పులతో తగ్గిన వ్యవసాయ యంత్రాల ధరలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రమణారెడ్డి, గ్రామ రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయం కోసం ట్రాక్టర్లు, పరికరాలను, థైవాన్ స్ప్రే పంపులు, డ్రిప్ పరికరాలు, డ్రోన్ తదితర వాటిని తగ్గిన ధరకు కొనుగోలు చేసి వ్యవసాయ యాంత్రీకరణతో ముందుకు సాగాలన్నారు. వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించండి



బిలకలగూడూరులో రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో త్వరలో జరుగనున్న రీసర్వే పనులను జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతి రైతు సర్వేయర్లకు సహకరించాలని తహసీల్దార్ వెంకటరమణ కోరారు. గురువారం గ్రామంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. రైతు పొలంలో సర్వే చేస్తున్నట్లు యజమానులకు ఒకరోజు ముందుగానే సమాచారం అందించాలన్నారు. రైతు పొలం హద్దులను చూపించిన అనంతరం వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించాలన్నారు. రీసర్వే పనులు పొలాల చుట్టుపక్కల రైతుల సమ్మతితోనే కొలతలు వేయాలన్నారు. రీసర్వేలో రైతులకు అన్యాయం జరుగకుండా రికార్డుల ప్రకారం ఉండేలా చూడాలని సర్వేయర్లకు సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ హరికృష్ణ, మండల సర్వేయర్ మధు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇది కాదా నిర్లక్ష్యం..?



దెబ్బతిన్న ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ సైడ్‌వాల్

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ సైడ్‌వాల్‌కు పగుళ్లు ఏర్పడి ప్రమాదాలకు సంకేతాలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన కాల్వలకు సైడ్ లైనింగ్ పనుల్లో భాగంగా కాంక్రీట్ పనులు చేశారు. తర్వాత ఏళ్లు గడించినా మరమ్మతులు చేయకపోవడంతో లైనింగ్ నానాటికి నెర్రలిస్తోంది. సమస్యపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మతులు పనులు చేపట్టడం లేదు. కాల్వల ద్వారా ఏటా కొన్ని క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అలాంటి ప్రధాన కాల్వలకు సైడ్‌వాల్ పగుళ్లిస్తున్నా పట్టించుకోవడం లేదు. నీటి ప్రవాహ సమయంలో లైనింగ్ కొట్టుకుపోతోంది. గతంలో రెండు సార్లు బనగానపల్లె వద్ద ప్రధాన కాల్వలకు గండ్లు పడ్డాయి. గండ్లు పూడ్చేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. అలాంటి పరిస్థితి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకొని దెబ్బతిన్న సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మహిషాసుర మర్దిని అలంకరణలో వాసవీమాత



ఏఆర్ కాలనీలో..



నిడ్జూరులో..



మహిషాసురమర్దినిగా వెంకాయపల్లె ఎల్లమ్మ



గార్గేయపురం బసవన్న కాలనీలో దుర్గమ్మ



నూతనపల్లెలో దుర్గమ్మ

జయజయహే మహిషాసురమర్దిని



మహిషాసురమర్దినిగా పార్వతీదేవి



సి.బెళగల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నిడ్జూరులో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



మహిషాసురమర్దినిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

గడివేముల: స్థానిక అమ్మవారి శాలలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, వాసవీ మాత హోమం, మహా మంగళ హారతి తీర్థప్రసాద వినిమయ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వసంతలక్ష్మి మాట్లాడుతూ మహర్ణవమి రోజు మహిషాసుర మర్దిని అమ్మవారిని అపరాజితగా పూజిస్తారన్నారు. ఈ అలంకారంలో అమ్మవారిని పూజిస్తే భయాలు తొలగి శత్రువులపై విజయం సాధిస్తారని విశ్వాసముందన్నారు. గడివేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

● పాణ్యం: గత నెల 22న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రుల వేడుకలు నేటితో ముగియనున్నట్లు దేవదాయశాఖ ఈఓ సువర్ణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. బుధవారం అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించామన్నారు. గురువారం గ్రామోత్సవంతో వేడుకలు పూరవుతాయన్నారు.

●పాణ్యంలోని ఏఆర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వాహకులు మహిషాసురమర్దినిగా అలంకరించారు. చివరి రోజు కావడంతో అమ్మవారికి విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

● కర్నూలు(రూరల్): దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని నిడ్జూరు, మునగాలపాడు గ్రామ పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో వెలసిన దుర్గమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు నిమ్మకాయల దండ, బంతిపూల మాలలతో అలంకరించి కాయకార్పూరాలు సమర్పించి తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అందరూ కలిసి భోజనాలు చేశారు.

● దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను మహిషాసురమర్దినిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

● గార్గేయపురం బసవన్న వీధిలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు

● నూతనపల్లె గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దర్గమ్మను భక్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

● సి.బెళగల్: స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలోని ఈశ్వరాలయంలోని పార్వతీ దేవి, పాత బస్టాండ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో కొలువైన అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని పార్వతీ దేవిని నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమార్చనలతో పాటు పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారని పూజారి, సుదర్శణమాచార్యులు తెలిపారు. సి.బెళగల్ ఈశ్వరాలయంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

● కోడుమూరు రూరల్: పట్టణంలోని ఆయా ఆలయాల్లో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమివ్వడంతో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. కోడుమూరులో వెలసిన వల్లెలాంబదేవికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో సుంకులా పరమేశ్వరీ దేవి మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహిషాసురమర్దినిగా వల్లెలాంబదేవి



మహిషాసురమర్దినిగా అంబా భవాని



కె.నాగలాపురంలో..

ఘనంగా ఆయుధ పూజ



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు



సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ నిర్వహిస్తున్న ఎస్‌ఐ పరమేష్‌నాయక్



కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో పూజలు చేస్తున్న విద్యుత్ అధికారులు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్

సి.బెళగల్: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం దసరా పండుగను పురస్కరించుకుని బుధవారం ఆయుధాలకు ప్రత్యేక పూజలను ఆయా శాఖల అధికారులు, ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహర్ణవమి పూజల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన ఆయుధ పూజలో ఆర్ఎస్ డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల సచివాలయ సర్వే అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొని పూజలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సి.బెళగల్, పోలకల్, కొత్తకోట, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లలో అధికారులు సిబ్బందితో కలిసి ఆయుధపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు. తుపాకులు, రికార్డులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓర్వకల్లు: దసరా పండుగను పురస్కరించుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం పోలీసులు ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పూజలో దుర్గామాత పటానికి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది కూడా ప్రమాద ఘటనలు, నేరాలు, అసాంఘిక కార్యకలాపాల సంఖ్యను తగ్గించి సిబ్బందిని ఆయురారోగ్యాలతో దీవించాలని అమ్మవారిని పూజించారు. ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం



ప్యాలకుర్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ వరలక్ష్మి

కోడుమూరు రూరల్: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు వ్యవసాయ ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, డ్రోన్ వంటి పరికరాల ధరలు భారీగా తగ్గాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో బుధవారం మండల అధికారులు సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించి జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. వ్యవసాయ పరికరాలపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం వల్ల ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, డ్రోన్ వంటి వాటి ధరలు భారీగా తగ్గాయన్నారు. అలాగే సూక్ష్మ పోషకాలు, బయో ఫెస్టిసైడ్స్‌పై, పాడి పరిశ్రమలో పాలక్యాన్ల కొనుగోలు, ఆక్వాకల్చర్‌లోనూ జీఎస్టీని తగ్గించడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తగ్గిన జీఎస్టీ ధరల కరపత్రాలతో అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జీఎస్టీ కార్యాలయ అధికారిణి రమాదేవి, కోడుమూరు తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడు, ఏఓ రవిప్రకాష్, హెచ్ఓ మదన్ మోహన్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

● గూడూరులోనూ సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని బుధవారం అధికారులు నిర్వహించి జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీవర్దన్‌రెడ్డి, డీసీటీఓ సుబ్బారెడ్డి, గూడూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీఓ కృష్ణమోహన్ శర్మ, ఏఓ దస్తగిరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● జీఎస్టీపై అవగాహన

కల్లూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి బుధవారం తడకనపల్లె గ్రామంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ నగేష్, సర్పంచ్ సాహెరాబీ, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పండుగ సంత



కోడుమూరులో కిటకిటలాడుతున్న మెయిన్‌బజార్

కోడుమూరు రూరల్: దసరా పండుగ వేళ పట్టణంలోని వ్యాపార సముదాయాలన్నీ ప్రజల కొనుగోళ్లతో కిటకిటలాడాయి. బుధవారం ఉదయం నుంచే దుస్తులు, కూరగాయలు, పూలు, టెంకాయలు, కిరాణా దుకాణాలన్నీ కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా పండుగ సందర్భంగా కొనుగోలు చేయడానికి వచ్చిన జనాలతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో చిన్న, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు, రైతులు ఆర్థిక ఇబ్బందుల మధ్యనే దసరా పండుగను జరుపుకుంటున్నారు. పెరిగిన ధరలతో చిన్న కుటుంబానికి కూడా దసరా పండుగ ఖర్చు రూ.10 వేలకు పైనే వచ్చింది. దసరా పండుగ వేళ టెంకాయలకు డిమాండ్ ఏర్పడింది. నిన్న మొన్నటి వరకు రూ.30 పలికిన టెంకాయ పండుగ వేళ రూ.40 పలికింది.

పింఛన్ల పంపిణీ

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులోని ఫ రూక్‌నగర్‌లో బుధవారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ఎస్సీ, బీసీ కాలనీలలో పర్యటించి, అధికారులు, నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి అజర్‌అహ్మద్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలో మొదటి రోజు 94 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా సచివాలయాల్లో, వీధి చివర్లో, ఆలయాల పరిసరాల్లో, అరుగుల వద్దకు లబ్ధిదారులను పిలుపించి పింఛన్లు పంపిణీ చేయడం కనిపించింది.

రోడ్డుపైనే మురుగు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కల్లూరు: ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం తడకనపల్లె గ్రామంలోనిది. ఇది గ్రామంలో ప్రధాన రోడ్డు. నిత్యం గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వెడల్పు తక్కువగా ఉండటంతో పూడిక చేరి మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు, లార్వాలు, ఈగలకు నెలవుగా మారిందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పింఛన్ కోసం అంధురాలి పాట్లు



పింఛన్ కోసం వృద్ధురాలైన తల్లిని వెంటబెట్టుకుని రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న చిట్టెమ్మ

కోడుమూరు రూరల్: కోడుమూరుకు చెందిన చిట్టెమ్మ పుట్టుకతోనే అంధురాలు. చూసుకునే వారు ఎవ్వరూ లేకపోవడంతో వృద్ధురాలైన తల్లి శంకరమ్మతో కలిసి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న కాలనీలోని ఓ పూరిగుడిసెలో జీవిస్తోంది. చిట్టెమ్మకు ఎన్టీఆర్ భరోసా కింద నెలనెలా పింఛన్ వస్తుంది. వీరికి గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటికి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వడం లేదు. దీంతో ప్రతినెలా 1వ తేదీ వచ్చిందంటే వృద్ధురాలైన శంకరమ్మను చిట్టెమ్మ వెంటబెట్టుకుని వాహనాల మధ్య రోడ్డుపై నడుస్తూ కిలోమీటర్‌కు పైగా దూరం ఉన్న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని గ్రామ సచివాలయం వద్దకు వచ్చి పింఛన్ తీసుకుంటోంది. తాము అంత దూరం వచ్చి పింఛన్ తీసుకోలేమని, ఇంటికి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వాలని వేడుకున్నా సచివాలయ సిబ్బంది కనికరించడం లేదంటూ అంధురాలైన చిట్టెమ్మ వాపోయింది. గతంలో జగనన్న పాలనలో తెలవారకముందే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి తలుపు తట్టి పింఛన్ ఇచ్చి వెళ్లే వారని, నేడు అలాంటి పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేలా చూడాలని చిట్టెమ్మ వేడుకుంటోంది.

ఇంటింటి పింఛన్ల పంపిణీ అంతంత మాత్రమే

పింఛన్ తీసుకునే లబ్ధిదారులందరికీ ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఆదేశాలున్నా సిబ్బంది బేఖాతర్ చేస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇచ్చి మిగతా వారిని సచివాలయాల వద్దకు రమ్మంటుండడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.